# పార్కు బెంచీ

"సాకీ"

పార్కులో బెంచీమీద కూర్చుని ఎదురుగా నున్న రోడ్డుమీదనే దృష్టిని కేంద్రీకరించాడు తల నెరసిన ఆయన. వచ్చేపోయే కార్లకీ, బస్సులకీ, రకరకాల బండ్లకీ అంతులేకుండావుంది. అక్కడక్కడ మనుష్యులతోటీ, రకరకాల శబ్దాలతోటీ పార్కు 'అతి విశాలం' అనిపిస్తోంది. సమయం దరిదాపు సంధ్యవేళ ఆరు దాటింది. సంధ్యకాంతులు అంతటా ఆవరిస్తున్నాయి. ఆ మసక చీకటిలో వీధిదీపాలు మెరుస్తున్నాయి. ఆయన అలా చూస్తూవుండగానే రోడ్డుమీద కూడా అలజడి తగ్గుతోంది. బాగా చీకటి పడిపోతోంది. ఐనాకూడా. కనీ కనబడకుండా ఆ పార్కులో మనుషులు సంచరిస్తూనే వున్నారు. చెట్ల నీడల మాటునవున్న ఆ బెంచీలు పూర్తిగా ఖాళీ అయిపోలేదు.

ఆ వాతావరణం అంతా ఆయనకి బాగా నచ్చినట్లుంది. ప్రస్తుత అతని మానసిక పరిస్థితికి తగివుంది ఆ వెలుగుచీకట్ల కలయికా. ఆ కనీకనబడని మనుషుల కదలికా... జీవితంలో అన్నివిధాలా పరాజితులైనవారికి యీ సంధ్యవేళ తగ్గవేళ అనుకున్నాడు. పోరి ఓడిన స్త్రీ పురుషులు, నేలకొరిగిన తమ ఆశల్నీ, ఐశ్వర్యాలనీ, తరిచితరిచి చూచేవారి కళ్ళల్లో పడకుండా, దాచి యీ సంధ్య ఘడియల్లో యిట్లాంటిచోట్ల కాలక్షేపం చెయ్యడానికి వస్తారా? తమ ఒరిగిన భుజాలూ, మాసినదుస్తులూ కనిపించకుండా వుంటాయనా? లేకుంటే, తమనెవరూ అనమాలు పట్టగనా? ఓడిన ప్రభువైనా వింత చూపుల్ని ఎదుర్కోవలసిందే! మానవ హృదయమంత విషపూరితమా?

సంధ్యకాంతుల మసకవెలుగుల్లో మసిలేమనుషులకి, ఈ వింత దృశ్యాలంటే భయమే. అవి వారి మీద పడకూడదని జాగ్రత్తపడతారు. అదృష్టవంతులు ఆనందం అనుభవించే ఆ స్థలాల్లో, అంతా వెళ్ళిపోయాక తామూ తిరిగి ఆనందిస్తారు. చీకటి అలుముకున్న చెట్ల గుబురుల్లోంచి వీధిదీపాలకాంతీ, జనంసందడీ వినిపిస్తూనేవుంది. ఎదురుగుండా అంతస్తులలో కిటికీల సరుసలు కనిపిస్తున్నాయి. బహుశా జీవితరంగంలో ఎదురీదవలసి వచ్చినా, పరాజయాన్నెదుర్కొని వాళ్లు వాటివెనక వున్నారేమో? బెంచీమీద కూర్చున్న ఆయన ఎన్నో విషయాల్ని వూహించుకోడం మొదలెట్టాడు. పార్కు దరిదాపు యిప్పుడు ఖాళీ... పరాజితులసంఖ్యలో తనూ జేరవచ్చుననుకున్నాడు. డబ్బు విషయాలు అతన్ని ఒత్తిడి చెయ్యలేదు. కావాలంటే తనూ అందరిలాగా సంపదలకోసం అవస్థలుపడి దానికోసం ప్రయత్నాలు చేసేవాడే. అంతకంటే నాజూకైన లోతైన ఆశయంలోనే పరాజితుడైనాడు. ఆ క్షణంలో చాలా బాధపడి మానసికంగా కూలిపోయాడు. అందుకే పరాజితుల ఘడియల్లో, దీపకాంతులమధ్య చీకటి స్థలాల్లో తిరిగే మనుష్యుల్నిచూసి ఏదో క్రూరమైన ఆనందాన్ని అనుభవించేవాడు.

ఆయన ప్రక్క బెంచీలో ఓ పెద్దమనిషి కూర్చున్నాడు. ఎవరినీ దేన్నీకూడా ఆసక్తితో ఎదుర్కోడం మానేసిన తరహా విశదమవుతోంది ఆ పెద్దమనిషిలో. విరిగిన వేణువులోంచి వచ్చే సంగీతానికి ఏ గోపికా నాట్యం చెయ్యదు. ఆ విరిగిన వేణువు చేత ధరించినవాడే యీ పెద్దమనిషి అనుకున్నాడు. ప్రపంచ రీతుల్నిగురించి ఆరణ్యరోదనచేసే వారిలో ఒకడేమో! ఇంటికి పోడానికి కాబోలు లేచాడు. ఏ కారణంలేకుండానే, యింటిదగ్గర అందరూ యితన్ని చూసి విసుక్కుంటారనీ, అర్థం చేసుకునే వాళ్ళెవరూ అక్కడ వుండి వుండరనీ అనుకున్నాడు. చీకటి నీడల్లో కలిసిపోయింది ఆ పెద్దమనిషి శరీరం కూడా. ఆయన లేచీలేవగానే, అదే స్థలంలో ఓ యువకుడు వచ్చికూర్చున్నాడు. బట్టలుబాగానే ధరించాడు కాని, ఆ పెద్దమనిషికంటే ఏమంత